పరీక్షల భవనంలో వసతుల మెరుగు


ఆధునికీకరించిన వాష్ బేసిన్


మరమ్మతులు చేపట్టిన టాయిలెట్స్ బ్లాక్


అధునాతన కమోడ్

- టాయిలెట్స్ ఆధునికీకరణ
- రూ.5 లక్షలతో రెండు బ్లాకులు సిద్ధం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరీక్షల భవనంలో వసతులు మెరుగుపరిచారు. టాయిలెట్స్ బ్లాక్‌ని పూర్తిగా ఆధుకినీకరించారు. ఇటీవల ఉద్యోగుల సౌకర్యార్థం వాటిని మార్పు చేయాలని నిర్ణయించిన అధికారులు యూనివర్సిటీ ఇంజినీర్స్ కార్యాలయం నుంచి పలనులను ప్రారంభించి, పూర్తి చేశారు. షాపింగ్ మాల్స్, పెద్ద హోటళ్లలో ఉన్న మాదిరిగా టాయిలెట్స్‌ను తీర్చిదిద్దారు.

- పరీక్షల విభాగంలో దాదాపు 300 మందికి పైగా సిబ్బంది విధులు నిర్వహిస్తారు. వారి కోసం రెండు టాయిలెట్స్ బ్లాక్‌లు సుదీర్ఘకాలం క్రితం నిర్మించారు. కాల గమనంలో ఇవి పూర్తిగా పాడై పోయాయి. వర్సిటీలో ప్రతి విభాగాన్ని ఆధునికీకరించే పనిలో ఉన్న అధికారులు పరీక్షల విభాగంలో టాయిలెట్స్ బ్లాక్ సైతం మార్పు చేయాలని నిర్ణయించారు.


గతంలో అధ్వానంగా మరుగుదొడ్డి

- ఇంజినీరింగ్ అధికారులు ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసి మూడు నెలల క్రితం పనులు ప్రారంభించి, పూర్తి చేశారు. నూతనంగా అభివృద్ధి చేసిన టాయిలెట్స్ బ్లాక్‌లో వాష్ బేసిన్‌లకు గ్రానైట్ వాడారు. ఫ్లోరింగ్ పూర్తిగా టైల్స్ వేశారు. కమోడ్స్, యూరిన్ పార్టీషియన్స్ కొత్తవి అమర్చారు. నిరంతర నీటి సరఫరా వ్యవస్థ, గోడలు, తలుపులు, కమోడ్స్ వంటివి పూర్తిగా కొత్తవి ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో వీటిని మార్పుచేసి కొద్దిరోజుల క్రితం ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.
- నాడు–నేడు పథకం స్ఫూర్తితో వర్సిటీలో విభాగాలు, కార్యాలయాల్లో ఉన్న మౌలిక వసతులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే ప్రతీ విభాగంలో టాయిలెట్స్, రెస్ట్ రూమ్‌లను మార్పు చేసిన ఏయూ అధికారులు, ఉద్యోగులు అధికంగా ఉండే విభాగాలపై దృష్టి సారించారు. దీనిలో భాగంగా పరీక్షల విభాగంలో రూ.5 లక్షల వ్యయంతో రెండు టాయిలెట్స్ బ్లాక్‌లను పూర్తిగా ఆధునికీకరించారు.

మీ లెక్కలు తేలుస్తా!

- టీడీపీ నాయకులకు ఆ పార్టీ అభ్యర్థి వెలగపూడి హెచ్చరిక
- ఓటర్లకు డబ్బులు పంచకుండా నొక్కేశారంటూ రుసరుస



ఆరిలోవ: ఎన్నికల వేడి ముగిసింది. రెండు నెలలుగా నిద్రలేని రాత్రులు గడిపిన రాజకీయ పార్టీల నాయకులు ఈ నెల 13న పోలింగ్ జరగడంతో హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే తూర్పు నియోజకవర్గంలో టీడీపీ వార్డు నాయకులకు ఇంకా ఎన్నికల తలనొప్పి తగ్గలేదట. అసలు వారి తలనొప్పి ఏమిటని అనుకొంటున్నారా..? ఎన్నికల సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు నియోజకవర్గంలో అన్ని వార్డుల్లోను ఓట్ల కొనుగోలు కోసం విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆ డబ్బులు ఓటర్లకు పంపిణీ బాధ్యత నియోజకవర్గంలో 15 వార్డుల్లోను ఉన్న ఆ పార్టీ కీలక నాయకులకు అప్పగించారు. వెలగపూడి మనుషులే డబ్బులు పట్టుకుని వెళ్లి వార్డు నాయకుల సమక్షంలో ఓటర్లకు అందజేశారు. అంతవరకు బాగానే జరిగిపోయింది. ఈ నెల 13న ఎన్నికల ప్రక్రియ ముగిసింది. డబ్బులు పంచేశాము, టీడీపీకే ఓట్లు వేశారు అని వార్డుల్లో నాయకులు హమ్మయ్యా అంటూ ధీమాతో ఉన్నారు. ఇంతలో వెలగపూడి బుధ, గురువారాల్లో వార్డుల్లోని నాయకులను ఎంవీపీ కాలనీలో తన కార్యాలయానికి పిలిపించుకొని ఓటర్లకు డబ్బులు సరిగా పంచలేదని, అందుకే అనుకున్న విధంగా టీడీపీకి ఓట్లు పడలేదని వెలగపూడి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఓటర్లకు డబ్బులు ఇవ్వకుండా మీ వద్ద ఉంచుకున్నారంటూ కడిగిపారేశారట. ఎంత మంది ఓటర్లకు పంపిణీ చేశారు? ఎంత మిగిల్చుకున్నారో నాకు తెలుసని, ప్రతి ఒక్కరి జాతకాలు తన వద్ద ఉన్నాయని, రెండు, మూడు రోజుల్లో మీ లెక్కలు అన్నీ తేలుస్తానని హెచ్చరించారట. దీంతో వార్డుల్లో ఇన్‌చార్జిలు, కీలక నాయకులు ‘ఇదేమి తలనొప్పి రామకృష్ణా’అంటూ తలలు పట్టుకొంటున్నారట. ఎన్నికల సమయంలో మీరే నన్ను గెలిపించాలంటూ అడిగిన వెలగపూడి.. ఎన్నికల ముగిసిన తర్వాత లెక్కలు తేలుస్తానని అనడం వార్డు టీడీపీ నాయకులకు మింగుడుపడడం లేదట. ‘ఏరు దాటినంత వరకు ఓడ మల్లన్న, ఒడ్డు చేరిన తర్వాత బోడి మల్లన్న’ అన్న చందంగా వెలగపూడి తీరు ఉందని ఆ పార్టీ నాయకులు అసహనంతో ఉన్నారట. పంపిణీ చేసిన డబ్బులు గురించి లెక్కలు అడగడంపై కొందరు టీడీపీ నాయకుల పరిస్థితి కుడితిలో పడిన ఎలుకలా మారిందని గుసుగుసలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

మోకాళ్ల నొప్పికి ఆధునిక శస్త్ర చికిత్స

ఆరిలోవ: హెల్త్ సిటీ అపోలో ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్ మోకాళ్ల నొప్పితో బాధపడుతున్న ఓ వ్యక్తికి ఆధునిక విధానంలో శస్త్ర చికిత్స చేశారు. సుమారు 24 సంవత్సరాల వయసు గల వ్యక్తి మోకాళ్ల నొప్పితో కొన్నాళ్ల నుంచి బాధపడుతూ అపోలోలో సంప్రదించారు. మోకాలు బాగా వాపుతో ఉంది. దాన్ని పరిశీలించి ఎంఆర్‌ఐ స్కానింగ్ ద్వారా పెరోనియల్ టినోసైనోవైటిస్ వ్యాధిగా నిర్ధారించినట్లు ఖాన్ తెలిపారు. రోగికి పెరోనియల్ టెండోస్కోపిక్ టినోసైనోవెక్టమి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఇలాంటి సున్నితమైన, ఆధునిక పద్ధతిలో శస్త్ర చికిత్స చేయడం రాష్ట్రంలోనే మొదటిసారి అని ఆయన తెలిపారు.

విద్యుత్ దీపాలు వెలిగించరూ..


ఆరిలోవ ప్రగతినగర్‌లో విద్యుత్ దీపం లేని స్తంభం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీ ప్రగతినగర్‌లో పలు చోట్ల విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో ఇక్కడ రాత్రి వేళ పూర్తిగా చీకట్లు అలముకుంటున్నాయి. ఈ ప్రాంతంలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. రాత్రి వేళ బయట నుంచి ఇళ్లకు వెళ్తున్న వారిపై కుక్కల చీకటిలో వెంటబడి దాడి చేస్తున్నాయి. ఇక్కడ సుమారు నెల రోజులుగా దీపాలు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. వీధిలో 26/ఏ/3/1 విద్యుత్ స్తంభం నుంచి వరుసగా దీపాలు వెలగడం లేదని అంటున్నారు. జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు స్పందించి ప్రగతినగర్‌లో విద్యుత్ దీపాలు వెలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

రేపటి నుంచి కేరళ ఆయుర్వేద వైద్య శిబిరం

దాబాగార్డెన్స్ : ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు శనివారం నుంచి 21 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఓ హోటల్లో ఆయన మాట్లాడారు. ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 4 రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునేవారు అపాయింట్‌మెంట్ కోసం 7675861446, 0891-2568264 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. చర్మవ్యాధులు, ఆర్థరైటిస్, సైనసైటిస్, సొరియాసిస్, ఒత్తిడి, ఈఎన్‌టీ సమస్యలు, హైపర్ టెన్షన్, కీళ్ల వ్యాధులు, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ నాయర్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపాన గల తమ కేంద్రంలో నేరుగా వచ్చి కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

‘జీవ వైవిధ్య పరిరక్షణ మనందరి బాధ్యత’

సీతమ్మధార: జీవ వైవిధ్య పరిరక్షణ మన బాధ్యతగా స్వీకరించాలని సిఫా ట్రస్ట్ సీఈవో డాక్టర్ శశిప్రభ పిలుపునిచ్చారు. ఈ నెల 22న జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా గురువారం సీతమ్మధారలోని డాక్టర్ శశిప్రభ ఇంటి మేడ మీద మిద్దె తోటలో ప్రచార కార్యక్రమాన్ని సిఫా ట్రస్ట్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవోలు ప్రారంభించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం–2024 ప్రణాళికలో మనమంతా భాగస్వాములు కావాలని కోరారు. ఎకో వైజాగ్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మిద్దె తోటలు పెంచి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, గ్రీన్ అంబాసిడర్స్ ప్రతినిధి రామలక్ష్మి, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధి కృష్ణకుమారి, ఎస్.సి. ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ సైన్స్ ఇంటర్న్‌షిప్ విద్యార్థులు డి.సంధ్య, కె.భార్గవి పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అంత్యక్రియల్లో పాల్గొన్న రెడ్‌క్రాస్ ప్రతినిధి మురళీ

ఎంవీపీ కాలనీ: అనాథ శవానికి ఆరిలోవ పోలీసుల సహకారంతో రెడ్‌క్రాస్ ప్రతినిధులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలోని ముడసర్లోవ సమీపంలో ఈ నెల 6న ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్కన అనారోగ్యంతో ఉండడాన్ని గమనించి అటుగా వెళుతున్న ఓ మహిళ 108కి సమాచారం అందించింది. 108 సిబ్బంది వచ్చి ఆయనను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించడంతో పాటు ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఆరిలోవ పోలీసుల విచారణలో ఆ వ్యక్తికి ఎవరూ లేరని తేలింది. ఈ క్రమంలో ఈ నెల 15న చికిత్స పొందుతూ ఆయన మరణించాడు. దీంతో ఆరిలోవ సీఐ గోవిందరావు ఆదేశాలతో పెదవాల్తేర్‌లోని రెడ్ క్రాస్ హోం ప్రతినిధి మురళీ, కానిస్టేబుల్ బి.తులసిరామ్ జ్ఞానాపురం శ్మశానవాటికలో అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల సేవలపై పలువురు ప్రశంసలు కురిపించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ : జీవీఎంసీ 10వ వార్డు పరిధిలో విద్యుత్ విభాగం అధికారులు శుక్రవారం విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధి జూ పార్కు ఫీడర్‌కు సంబంధించిన ప్రాంతాలలో చెట్ల కొమ్మలు నరకడం, లైన్ మరమ్మతులు చేపట్టడం చేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్దిలపాలెం : ఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలో కేఆర్ఎం కాలనీ శివాలయం 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ, శివాలయం వీధి, జేఆర్ నగర్, వెంకోజీపాలెం, ఇసుకతోట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెరుగుతున్న సేంద్రియ ఉత్పత్తుల వినియోగం

బీచ్ రోడ్డు: ప్రపంచ వ్యాప్తంగా సేంద్రియ ఉత్పత్తుల వినియోగం గణనీయంగా పెరుగుతోందని ఇనెరా సంస్థ సీఈవో ఆగమ్ ఖరే తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో సేంద్రియ వ్యవసాయంలో పరికరాలు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పరంపరాగత్ కృషి వికాస్ యోజన కార్యక్రమం ద్వారా సేంద్రియ ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. రసాయన రహిత వ్యవసాయాన్ని వృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయం కోసం బయో ఇన్‌పుట్‌లను ప్రోత్సహించడం, వాటిని ఉపయోగించడానికి రైతులకు ఆర్థిక సహాయాన్ని అందించడం ప్రశంసనీయమన్నారు. సేంద్రియ ఉత్పత్తులకు ఐరోపా, ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా వంటి దేశాలలో విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయంపై విస్తృత ప్రచారం చేసేందుకు మాజీ క్రికెటర్ ఎంఎస్ ధోని అంగీకరించడం మంచి పరిణామమని చెప్పారు.

వర్షంతో ఉపశమనం


కుండపోతతో కాలువలను తలపించిన కాలనీ రోడ్లు

మద్దిలపాలెం: ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగర వాసులకు గురువారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షం ఊరటనిచ్చింది. వర్షానికి పలు కాలనీ రోడ్లు చెరువులను తలపించాయి. కాలువలు, రోడ్లపై వర్షపు నీరు పొంగిపొర్లింది. మధ్యాహ్నం వరకూ కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. వేసవి తాపం నుంచి కాస్త ఉపశమనం లభించిందని నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే కాలువల నుంచి కొట్టుకొచ్చిన చెత్తచెదారం రోడ్లపై పేరుకుపోయింది. మురుగునీరు సైతం అక్కడక్కడా నిల్వ ఉండిపోయింది. శివాజీపాలెం, పిఠాపురం కాలనీ, మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ, ఇసుకతోట ప్రాంతాలలో వర్షపు నీటితో కాలనీ రోడ్లు నిండిపోయాయి.

కుటుంబం చెంతకు మహిళ


కుమారుడు, కుమార్తెతో బసుమతి మండల్

అల్లిపురం : గత ఏడాది డిసెంబర్‌లో తమకు అందిన సమాచారం మేరకు భీమిలిలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఒక మహిళను ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ సిబ్బంది తీసుకొచ్చి ఆశ్ర యం కల్పించారు. వసతి గృహంలో ఉండగానే ఆమెకు చికిత్స అందించడంతో ప్రస్తుతం ఆమె కోలుకుని తన వివరాలు చెప్పగలిగింది. తన పేరు బసుమతి మండల్ అని, తమది పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాకు చెందిన మొల్లాబెలియా గ్రామ మని స్పష్టం చేసి.. తమ చిరునామా కూడా తెలిపింది. దీంతో ఏయూటీడీ సిబ్బంది పూణేలోని శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులకు సమాచారం అందజేశారు. వారు మహిళ కుమారుడు గోపాల్ మండల్, కుమార్తెకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు గోపాల్ మండల్ మాట్లాడుతూ తమ తండ్రి వేరే పెళ్లి చేసుకుని బెంగళూరు వెళ్లిపోయాడని, తన సోదరితో కలిసి కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపాడు. తమ తల్లిని అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపాడు.

బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభం


ఇసుకతోట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఓ వ్యక్తికి బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట పట్టణ ఆరోగ్య కేంద్రంలో బీసీజీ వ్యాక్సిన్ ప్రక్రియను గురువారం ప్రారంభించారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి బీసీజీ వ్యాక్సిన్ వేశారు. క్షయ వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తల చర్యల్లో భాగంగా ఎంపిక చేసిన వయస్సుల వారికి ఈ వ్యాక్సిన్ వేస్తున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సిన్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వేయనున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం


కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎంవీవీ


శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎంవీవీ, కుటుంబ సభ్యులు

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి తిరుపతికి వెళ్లిన ఆయన మెట్ల మార్గంలో తిరుమలకు చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించాలని, తూర్పు ఎమ్మెల్యేగా తనకు అత్యధిక మెజారిటీ లభించాలని ఈ సందర్భంగా శ్రీవారిని కోరుకున్నట్లు ఎంవీవీ తెలిపారు. ఆయన వెంట ముళ్లపూడి నాగజ్యోతి, కుమారుడు శరత్, కోడలు జ్ఞానిత, పార్టీ నాయకులు కొవ్వూరి రాజు, ఉమ్మిడి కల్యాణ్ తదితరులు ఉన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి


డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పాత వెంకోజీపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది

మద్దిలపాలెం : ప్రపంచ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం 15వ వార్డు పాత వెంకోజీపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రెనిషా మెంటో ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని విధిగా ప్రతి శుక్రవారం నిర్వహించాలని సూచించారు. డెంగ్యూ నుంచి జాగ్రత్తలపై కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం పర్యవేక్షణాధికారి వై.వి.ఎస్.రత్నం, సహాయ కార్యకర్తలు శేషు, శ్రీనివాస్‌రెడ్డి, రామునాయుడు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీఐ మాధవికి ఏయూ డాక్టరేట్


ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఎంవీఐ మాధవి

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని, విశాఖలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఐ.మాధవికి డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్య ఎల్.ఎస్.వి.ప్రసాద్ పర్యవేక్షణలో డీజిల్ ఇంజన్లలో ఉద్గారాలను తగ్గిస్తూ, సామర్థ్యాన్ని పెంచే దిశగా జరిపిన పరిశోధనకు ఆమె డాక్టరేట్ సాధించారు. బయో డీజిల్‌లో టైటానియం నానో పార్టికల్స్‌ని జోడించి ఇంధనంగా ఈ పరిశోధనలో ఉపయోగించారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆమె డాక్టరేట్ ఉత్తర్వులను గురువారం స్వీకరించారు. ఈ సందర్భంగా డీటీసీ డాక్టర్ జి.సి.రాజారత్నం, ఏవో ఐ.రఘుబాబు, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు ఎంవీఐ మాధవిని అభినందించారు.

19 నుంచి శ్రీనివాసుడి కల్యాణోత్సవాలు

నేడు ఆహ్వాన పత్రికల పంపిణీ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 22వ వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీనివాసుని తిరుకల్యాణోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న ఉత్సవాలు ప్రారంభమై 23వ తేదీతో ముగుస్తాయన్నారు. ఈమేరకు శుక్రవారం కల్యాణ ఆహ్వాన పత్రికల పంపిణీ జరుగుతుందని చెప్పారు. 19వ తేదీ ఉదయం 5 గంటలకు వైభవుడికి సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలబోగం, మంగళాశాసనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌గ్వరుణ, రక్షాసూత్రబంధన, మృత్సంగ్రహణం, అంకురార్పణ, పతాక ప్రతిష్ఠ, విశేష హోమాలు, మహానివేదన, మంగళాశాసనం, నిర్వహిస్తామని, సాయంత్రం 5 గంటలకు ఎదరు సన్నాహ ఉత్సవం అనంతరం 6 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవాన్ని చేస్తామని ఈవో వివరించారు. 20న ఉదయాస్తమాన సేవలతోపాటు 9 గంటలకు లక్ష మల్లెలతో అర్చన, సాయంత్రం 5 గంటలకు సదస్యోత్సవం నిర్వహిస్తారు. 21న ఉదయం 9 గంటలకు శ్రీవారికి చక్రస్నానం, వసంతోత్సవం, సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ, 22న ఉదయం తిరువీధి మహోత్సవం, 23న ఉదయం 6 గంటలకు వైభవుడికి పౌర్ణమి పంచామృతాభిషేకం అనంతరం సర్వాంగ వజ్రకవచంతో శ్రీవారి దర్శనం, 25న మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

ఏటీఎం మిషన్ ధ్వంసం: వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార : డైమండ్ పార్కు దరి బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంను మద్యం తాగిన వ్యక్తి ధ్వంసం చేసిన ఘటన ద్వారకానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధురవాడకు చెందిన మానేపల్లి మణికంఠ పూటుగా మద్యం సేవించి డైమండ్ పార్కు సమీపంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంలోకి ప్రవేశించాడు. నగదు దోచుకునేందుకు ఏటీఎం మిషన్‌ను పగులగొట్టడంతో స్థానికులు బ్యాంకు అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ద్వారకా సీఐ ఎస్.రమేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని మణికంఠను అదుపులోకి తీసుకున్నారు. బ్యాంకు మేనేజర్ సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు మణికంఠను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత యోగా శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీ కాలనీ: రుషి గాయత్రి యోగా సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఈ నెల 19 నుంచి 14 రోజుల పాటు ఈ శిక్షణ జరగనుంది. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 94403 95439 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.